# రేడాడిలో ....

అజీజ్

నిశాంతరంలో మొదలంటూ ఊగే సరుగుచెట్ల పొద. నదీ గమ్యస్థానంలో సంక్షోభం. అటూ పోటూ అలల పోరు, హోరు.

సైరన్ల రోదనం. బాంబర్ల మోత. అదటు ఎదలలో కోలాహలం. విలాపాలు, రోదనాలాపాలు, హాహాకారాలు, నిట్టూర్పులు.

ఆ మహాపట్టణంలో ఓమూల సౌధోపరిభాగపు 'డరజన్'లో నేనూ నా గులాబ్ కంపనం.

డింగ్ డింగ్ డింగ్—టిక్—టిక్—టిక్ ఒక్కొక టిక్...టిక్...హృదయంలో ఒక్కొక్క వాడి శూలం.

రోడ్డుమీది గ్రుడ్డి వెన్నెల్లో మిలటరీలారీ దూసుకుపోయిన ధ్వని బాంబర్ల చక్రభ్రమణాల మోతలో అస్పష్టం.

నా బాహువల్లికలో వణికే గులాబ్ గద్గద స్వరంతో "ఇదేనా మన ప్రళయం"!? "కాదు గులాబ్'...

'ఇంకా మీ వెఱ్ఱి ఆశ...భ్రమ'...'ధాం'... 'ధాం'...దిశలు మారుమ్రోగే కఠోరనాదం.

దూది క్రుక్కిన కర్ణద్వయంలో హోరు, ఎదలో తుఫాను. తలలో మతు.

సైరన్ల ఏడుపు శ్రుతిలో ప్రకృతిరోదనాలాపం. అంతా అశాంతిమయం.

చుట్టబడిన పరుపులో నేనూ నా గులాబ్ నిశ్చలం నిశ్శబ్దం. మూగవ్రతం కాదు తాత్కాలిక స్మృతిహీనం...

తెప్పరిల్లి విప్పారిన నా నయనద్వయంలో ఘాతుక విద్యుత్ కిరణపుంజం. వెలుతురులో వెఱపొంది బద్దగించిన కళ్ళల్లో అంధకారం. ఆస్థితిలో 'గులాబ్...గులాబ్'...నా మేల్కొలుపు.

...టిక్...టిక్...టిక్...జవాబు. అంతే.

హెచ్చుస్థాయిలో గులాబ్...

ఒళ్లు విరచి కళ్లు నులిపి 'మనం ఎక్కడా!'...

అంది ఆ అస్పష్ట కంఠనాదం.

'ఇక్కడే. ఈ చతురంలోనే...

'గాయపడ్డారా!'

'లేదు'.

'అబ్బా! ఈ మీదిగోడ'...

'గోడకాదు పరుపు.' అని నే లేచి ఆమెను లేపాను.

ఎలక్ట్రిక్ స్విచ్చి ఆఫ్‌చేసి తలుపులు తెఱచాను. వీధులనిండా చీమలబారులా జనసమూహం. దుమ్ము వెదజల్లే లారీల విసురు. ఎ. ఆర్. పి. వాళ్ళ హడావిడి. అదో వింతసందడి.

ఆతృతకొద్దీ మెట్లుదిగి ముందుకు సాగుతున్న గుంపులో చేరాను. వాళ్ళ మాటల ధోరణినిబట్టి రాత్రి బాంబుల వృష్టికి గురియైన శాలీలు పెట్రోలు టాంకు దానికి, దరిగావున్న హాస్టలు చుట్టుప్రక్కల ఇళ్ళల్లో పదిహేడుగురికి ప్రమాదకరమైన గాయాలు, అరువది ఆరుగురు మృతులు అని జాబితా తేలింది.

ఎంత నడచినా తరగనిదారిని త్రొక్కుకొంటూ చివరికి మా గమ్యస్థానపు పొలిమేరలకు చేరుకొనేసరికి కళ్ళకెదురుగా 'రస్తాబంద్' బల్లలు పోలీస్ పహారా. ఇవి మా కెదురైనవి.

పట్టణం పరాక్రమణం కాకపోయినా శిథిలాల్ని చూడకూడదట. చూడనీయరట" అని గుంపులో గుసగుసలు.

చుట్టుప్రక్కల మేడలమీద ఇసుక వేస్తే రాలనట్లుగా ప్రేక్షకజనం.

వీటి మూలాన్నీ నా ఆతృత హెచ్చి అనుమతి లేకుండానే ఎ. ఆర్. పి. మేడ ఎక్కాను. అదృష్టవశాత్తు ఆ అంతస్తులో ఎవ్వరూ లేరు. ఇంతకూ ఆ కంగారులో ఏవో మొండిగోడలు కాకీవస్త్రధారులు చుట్టూ జనం ఇవీ నే చూచినవి.

జాగుచేస్తే ప్రమాదం తటస్థిస్తుందని మెట్లు దిగుతూవుంటే "జపానీయులు రాక్షసులు వారి నేం చేసినా పాపంలేదు" అన్న మాటలు వినిపించాయి. బహుశా పై అంతస్తులో ఎవరో ఉపన్యాస మిస్తున్నారనుకొన్నా.

పరాభవం జరక్కపోయినా గాయితులను చూడలేకపోయానే అనే చింతతో కాళ్ళీడ్చుకొంటూ ఇంటికి చేరాను.

సామాను సర్ది ప్రయాణసన్నాహంలో ఉంది గులాబ్.